# ఈ వారం కథ

## నిజమే కదా!



శ్రీవారి ఏకొలదేవి

తొమ్మిది దాటిపోతుంది.

పని మనిషి ఇంకా రాలేదు. ఎక్కడి పనులక్కడే ఉన్నాయి. అవతల సెమినార్‌కు టైమైపోతుంది. సెమినారేమో పదకొం డింటికి. ఎంతలేదన్నా నేను పదింటికయినా అక్కడ లేకపోతే ఏం బావుంటుంది!? క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తనైతేనూ!!

నాకు క్షణ క్షణానికీ చికాకు పెరిగిపోతుంది.

యిక లాభం లేదని నేనే కొంగు నడుముకి చుట్టాను. ఎంత హడావిడిగా చేద్దామన్నా ఏ పనీ తొందరగా అయ్యేటట్టు కనిపించలేదు.

సింక్ నిండా ఎంగిలి గిన్నెలు, ఇల్లంతా కాగితాలతో పిల్లలు విడిచిన గుడ్డలతో చిందర వందరగా–

ఛీ! ఛీ!! యిదెక్కడ చచ్చిందో ఏమో! మంచి సమయంలోనే దీనికి రావాలనిపించదు. పని మనుషులను నమ్ముకునే కంటే ఎవరిపనులు వాళ్ళు చేసుకోవడమెంతో ఉత్తమం. ఎంతో హాయినూ.

తీరికగా పనులన్నీ చేసుకుంటూ పోతే పుణ్యకాలం కాస్తా దాటిపోతుందని అటూ యిటూ హడావిడిగా సర్దివట్టుచేసి నేను రెడీ అయి బయలుదేరే సరికి తొమ్మిది నలభై.

ఈ పురుషాధిక్య సమాజం గురించీ, పురుషుల వద్ద తమ హక్కులు బందీ అయిన విషయం గురించీ, ఆడవాళ్ళలో రావాల్సిన చైతన్యం గురించీ యింకా ఎన్నెన్నో... యివ్వాళ తను యిచ్చిన ఉపన్యాసం తనకే అబ్బురమనిపించింది. నిజంగా అంతటి భావావేశం నాలో యిన్ని రోజులు ఎక్కడ దాగుందో అర్థం కాలేదు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మహిళా హక్కులు పరిరక్షణ' అన్న అంశంపై జరిగిందా సెమినార్. సెమినార్లో అందరికంటే తన ఉపన్యాసమే బాగుం దట. ఒక్కొక్కరి అభినందనలు వింటుంటే ఎంత గర్వంగా అనిపించిందనీ.

పనిలో పడిపోయి ఉదయపు సెమినార్ సంగతులు నెమరేసు కుంటున్న నాకువెవరో వచ్చినట్టుగా తలుపుచప్పుడు వినిపించింది. వెళ్ళితలుపు తీసాను.

ఎదురుగా యాదమ్మ. మా పనిమనిషి. సంగతేంటని అడగా లని నోరు తెరచి నేను దాని ముఖం చూసి ఆగిపోయాను.

ఏడ్చీ, ఏడ్చీ ఉబ్బిన ముఖం, కళ్ళు ఎర్రగా నీళ్ళతో నిండిన ఆ అవతారాన్ని చూడగానే జరగకూడనిదేదో జరిగిందనిపించింది.

లోనికొస్తూనే నేలమీద చతికిలబడి ఏడుపు లంఘించుకుంది.

అది ఎందుకేడుస్తుందో అర్థంకాక నేను అయోమయంలో పడ్డాను. ఏమయ్యిందని అడిగాను.

అంతా అయిపోయిందమ్మా. యిన్నాద్దులు ఏదయితే అయితదని బయపడ్తినో గదే జర్గింది తల్లీ! అంది ఏడుస్తూనే.

అసలేమయ్యిందే దాని ఏడుపు చూస్తుంటే నాకు జాలిక ల్గింది.

నేనన్యాలమైపోయిన తల్లీ. దేవుడు నాకన్యాలం చేసిండు, నేనెన్నలకు జెప్తకుండు దేవుడో పిల్లలు పుట్లేదని నా మొగుడు నన్నిడిసెట్టి వుంకో లగ్గం చేసుకుండు నేనేంజేతు దేవుడో.

ఎంత అమానుషం. కేవలం పిల్లలు కాలేదన్న వంకతో షర్టు మార్చినంత తేలికగా పెళ్ళాన్ని మార్చేశాడా. అంత అహంకా రమా?!

ఉదయపు ఆవేశం యింకా తగ్గలేదు కాబోలు నాకు కోపం నషాళానికంటి పోయింది.

నా అవ్వ ముండలేదూ. అది నేను బిడ్డనని గూడ సూడ కుండ నా కాపురంల సిచ్చు వెట్టింది. నా చెల్లెనే నాకు సవతిగ జేసి నాయింట్లకుపంపింది. వయసు పోరి దొర్కుతె ఏ మొగోడూ కుంటడు జెప్పు, ఆడూ మారిపోయిండు, దాని మోజుల పడ్డడు అని ముక్కు చీది.

మాకులపోళ్ళు, అల్లూ అంతా ఒక్కటై కమేటు గట్టిరు. నీ బాంచెన్ గట్లెందుకైంది అని అడిగిందే పాపమైంది. ఉంటె ఉండు. పోతె పో అని బండబూతులు తిట్టుకుంట పావసావ సంపిండు నీ బాంచెన్.

కోపంతో నా ముకం ఎర్రగా కందిపోయింది. ఆ సమ యంలో నా ఎదురుగా ఏ మొగోడున్నా బలయ్యేవాడే నా కోపానికి.

ఏం నువ్వు మనిషివి కాదా?! వాడు నిన్ను అంతగా కొడుతుంటే చేతగాని దానిలా తన్నులు తినకపోతే ఎదురు తిరగొచ్చుగా.

ఏందీ ఎదురు వడి కొట్టుమంటివా?! మాబాగ జెప్తివవ్ తల్లీ! అన్నికొడ్తే నేను బత్కుతనా! అయినా తప్ప నాతామంచుకుని మొగన్ని గొట్టుమంటవేంది?!

తప్పు నీ దగ్గరుందని ఎవరు చెప్పారు?!

అంత చిన్న విషయం కూడా తెలియదా అన్నట్టు మొఖం పెట్టి.

ఒకరు చెప్పాలేందీ. పిల్లు గాకపోతే దానికి మొగోని తప్పేంది. గదంతా నా సొంటి ఆడోళ్ళ కర్మయితే. అంతా నా కర్మ అంటూ నెత్తిని కొట్టుకుంది.

నేను అదిరిపోయాను. దాని అమాయకపు విశ్వాసాన్ని చూసి.

ఖర్మ లేదు, కాకరకాయలేదు. లోపం ఎవరిదగ్గర అని చెప్పాల్సింది నువ్వూనేనూ కాదు డాక్టర్లు.

అది ఆశ్చర్యంగా నావైపు చూస్తూ.

ఏమోనమ్మా .గవన్ని నాకెట్ల తెలుస్తయ్యి. అయినా నువ్వు చెప్పింది నేను నమ్మినా మావోళ్ళు నమ్మరు. యీ జన్మల నా బతుకింతే అనుకుంట.

అజ్ఞానంతో ఆలోచనా శక్తి పెరుగక అమాయకంగా మాట్లా డుతున్న యాదమ్మను చూస్తే చెప్పలేనంత జాలేసింది. ఇలాంటి ఆడవాళ్ళను పావులుగా చేసుకుని పురుషస్వామ్యం రెక్కలు పెంచుకోవడం తలుచుకుంటుంటే ఒళ్ళంతా కోపంతో ఊగి పోతుంది.

యాదమ్మ జీవితంతో ఆడుకుంటున్న ఆ పురుషాహంకారికి తగిన గుణపాఠమే నేర్పాలనుకున్నాను.

భార్య వుండగా ఆమె యిష్టం లేకుండా రెండో పెళ్ళి చేసుకోవడం నేరమనీ, కోర్టులో కేసు వేస్తే గెలవడం ఖాయ మనీ, అందుకు కావలసిన సాయమంతా మేము చేస్తామనీ యాదమ్మకు అర్థమయ్యేలా వివరంగా చెప్పాను.

అమ్మోవ్! యీ కోరట్లూ కేసులా! నా శాతగావు గనీ నీకాల్మొక్త. వన్నిదువు తల్లీ. తిట్టుకుంటవో తీవుకుంటవో గాన్నే పడుంట. అంది భయం భయంగా.

కోర్టనేసరికి భయపడి పోయింది. నచ్చచెప్పి నా దారికి తెచ్చుకోడానికి ప్రయత్నించాను. నా మాట వింటేనా. నే చెప్ప వట్టువింటే అసలుకే ఎసరొస్తదేమో అంటూ పనికి మాత్రం రేపుదయం వస్తానని, వెనుకనుండి నేనెంత పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది.

నా మనసంతా అదోలా అయిపోయింది.

అది వెళ్ళిపోయాక రెండు మూడు గంటల వరకు ఆ విషయమే ఆలోచించాను.

ఏమిటీ మనుషులు. ఎందుకిలా ప్రవర్తిస్తారు? ఆమె ఆడదై యుండి యింకో ఆడదానికి అన్యాయం చేయడానికి మనసెలా ఒప్పతుంది?

యింత జరిగాకయినా యాదమ్మ ఎదురు తిరగలేకపో తుంది. ఎందుకు? అన్నింటికీ అజ్ఞానమే కారణమా?! ఎటూ తేల్చుకోలేక పోయాను.

ఆరోజు రాత్రి విషయమంతా మా 'వారికి వివరించి నా సందేహాలను ఆయన ముందు పరిచాను. తీర్పుమని.

అన్నట్టు చెప్పడం మరిచాను కదూ? మా వారు, నా అభి ప్రాయాలకు విలువనిచ్చి ప్రోత్సహించే మంచి మనిషి. స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలని ఆదర్శాలను చెప్పడమే కాకుండా చేసి చూపించే ఉన్నత వ్యక్తిత్వం కలవారు. యిలాంటి విషయాలలో మంచి సలహాలనిస్తూ ప్రోత్సాహమిస్తూంటారు.

మొత్తం విన్న తర్వాత, 'ముందు నీకేమనిపిస్తుందో చెప్ప' అన్నారు.

'ముమ్మాటికీ నిరక్షరాస్యతే అనుకుంటున్నా! అసలు నిరక్షరా స్యత అనేది తొలగిపోతే స్త్రీల సమస్యలన్నీ పరిష్కారమవుతా యని నాకనిపిస్తుంది' అన్నాన్నేను.

'ఎలా?! అన్నారు. వివరంగా చెప్పమన్నట్టుచూస్తూ.

'ఎలా అంటే.. చదువు విజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని పెంచు తుంది కదా! జ్ఞానాన్ని సంపాదించిన స్త్రీ తనకాళ్ళపై తాను నిలబడి ఆర్థిక స్వాతంత్ర్యం పొందుతుంది. ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందంటే పురుషాహంకారానికి ఎదురు తిరగడానికి బలం చేకూరినట్టే గదా' అన్నాను.

మావారు దీర్ఘంగా శ్వాసవిడిచి చెప్పడం మొదలుపెట్టారు. ఆయన ఆ భంగిమలోకి మారారంటే ఏదో ఒక కొత్త విషయం నేను వింటున్నానన్నమాటే.

'నువ్వు చెప్పింది సమస్యలలో ఒకటి మాత్రమే. దానికే పరిష్కా రాన్ని చూపెట్టావు. కానీ అదే అన్ని సమస్యలకు పరిష్కారము ఎంతమాత్రమూ కాదు. నువ్వు ఒక్కకోణం నుంచే ఆలోచి స్తున్నావు సుధా! ఆర్థిక స్వాతంత్ర్యము, అక్షర జ్ఞానం లేకనే ఆడవాళ్ళ ప్రవర్తన ఆవిధంగా వుంటుందని నీ వాదం, అంతేనా?!

మరి అన్నీ వున్న మన పక్క కాలనీ సుభద్రగారి మాటేమిటి?! ఆమె ప్రవర్తనకు కారణాలు యింకా కొత్తవి వెతుక్కోవాలా?! కాలనీ ఆడవాళ్ళు ఆడవాళ్ళు కాదనుకోవాలా?!

నిజమే. సుభద్రాంటీ ఉన్నతోద్యోగం చేస్తున్న విద్యాధికురాలే. కానీ ఆమె ప్రవర్తన?! ఎవరోదుండగులచే అత్యాచారానికి గురికాబడ్డ కోడలిని తన ప్రమేయం లేకుండానే జరిగిపోయిన ఆ సంఘటనని వేలెత్తి చూపుతూ ఆమె చెడిపోయిందని యింట్లోకి రాకుండా చేయడం. అట్లాంటి చెడిపోయిన ఆడ వాళ్ళు ఉండటానికి వీలులేదంటూ పెద్దఎత్తున ఆ కాలనీ ఆడవాళ్ళు నిరసన తెలపడాలూ మొత్తానికి విడాకుల పేరుతో ఆ అమ్మాయి బలిపశువు కావడం అంతా గుర్తొచ్చింది.

అలా చేయకుండా ఉండాల్సింది అని అప్పుడు ఎవరికివారే అనుకున్నాం కానీ ఆ దారుణాన్ని ఆపలేకపోయాం.

ఆ సందర్భంలో అలాంటి నిస్సహాయ క్షణాన, సాటి ఆడదా నిగా విశాల హృదయంతో ఆ బేలను ఆదరించాల్సింది పోయి చెడిపోయిందనే ముద్రవేసి దారుణంగా వెలి వేసారే మరివాళ్ళ చదువుకున్న మూర్ఖులా?!

నేనేం చెప్పాలో తెలియక తలదించుకున్నాను.

వాళ్ళలా ఎందుకు ప్రవర్తించారో నే చెప్పనా? సెల్ఫ్ సెక్యూరిటీ నేను ఆశ్చర్యంగా చూశాను.

యస్. సెల్ఫ్ సెక్యూరిటీ. ఆదరిస్తే సమాజం దృష్టిలో తమ పాతివ్రత్యానికి ఎక్కడ భంగం కలుగుతుందోనని అందరూ ఆమెను వెలివేసి మేమే అసలైన పతివ్రతలం సుమా అనే అభిప్రాయాన్ని నలుగురిలో కలిగించడానికి ఎవరికి వారే ఆడిన కుతంత్రనాటకం అది.

ఆలోచిస్తే నాకూ నిజమే అనిపించింది కాని ఒప్పుకోడానికి అహం అడ్డుపడింది.

నా ముఖంలోని భావాలను గమనించి.

పోనీ మన పనిమనిషి విషయమే తీసుకో. ఆమె తల్లీ, అత్తా చదువుకున్న ఆడవాళ్ళే అనుకుందాం. ఒకవేళ లోపం ఆమె భర్తలోనే వుంటే అతనిని కాదని, ఆమెకు ఇంకోపెళ్ళి జరిపిం చడానికి తల్లీ, అత్తా అనబడే ఆ ఆడవాళ్ళు అంగీకరిస్తారా?! సమాజపు ఆడవాళ్ళు దానిని హర్షిస్తారా?! నిలదీసారు నన్ను.

అంగీకరించకపోవచ్చు. సంశయంగా అన్నాన్నేను.

అనుమానమెందుకూ. ముమ్మాటికీ అంగీకరించరు. ఎందుకో తెలుసా?! యీర్ష్య. తాము భరిస్తున్న కట్టుబాట్లు తమ కళ్ళముందే ఇతరుల విషయంలో తెగిపోతుంటే చూసి భరిం చలేరు. తమలాగానే వాళ్ళూ ఆ కట్టుబాట్లకు బానిసలు కావాల్సిందే. తమకురాని స్వేచ్ఛ యితరులకు రావడానికి వాళ్ళు ఎంతమాత్రమూ ఒప్పకోరు. నువ్వు ఒప్పుకుంటావో లేదో కానీ ఆడవాళ్ళకు యీర్ష్య పాలు కాస్త ఎక్కువే.

ఆ మాటకు కాస్త కోపం వచ్చింది. కానీ ఎక్కువసేపు నిలువలేకపోయింది.

యిట్లా మగవారికైతే ఒకనీతి, ఆడవారికైతే ఒక నీతా?! ఆడా మగా యిద్దరికీ ఒకే న్యాయం వర్తింపజేయడానికి మీ ఆడవాళ్ళే సిద్ధంగా లేనప్పుడు యిక మగవాడెలా సిద్ధపడతాడు. అలాంటి అవకాశాలను ఆడవాళ్ళేకావలసినవన్నీ మగవారికి కల్పించుకుం టూపోతున్నారు. వాటిని వాళ్ళు వినియోగించుకుంటున్నారంటే. అందరి విషయంలో ఇలాగే జరుగుతుందని అనలేం కానీ ఎక్కువ సందర్భాలలో జరిగేదదే.

'తప్పలన్నీ ఆడవారి మీదికి నెట్టి, మగవారి తరపున వకాల్తా పుచ్చుకున్నట్టు మాట్లాడుతున్నారు' ఉక్రోషంగా అన్నాన్నేను.

'నేనిట్లా మాట్లాడుతుంటే నీకొచ్చినట్టుగానేనీలాంటి ఫెమిని స్టులందరికీ కోపం రావచ్చు కానీ లోతుగా ఆలోచిస్తే నా మాటల్లో నిజం కనిపిస్తుంది. రోజూ జరిగే వరకట్న చావులకు ప్రత్యక్షంగా మగవాడు కారణమైతే పరోక్షంగా అత్తా, ఆడబి డ్డలాంటి ఆడవాళ్ళే. కాదంటావా?! నిజానికియీపరోక్ష కర్తల ప్రభావమే ఎక్కువ. వాళ్ళు ఆడవాళ్ళు కారా?! ఆడవాళ్ళ య్యుండీ సాటి ఆడదాన్ని అంతగా హింస పెడుతుంటారు కదా. మరి దీనికీ అజ్ఞానమే కారణమంటావా?! అవి అడ్డుకోడానికి ఏ విజ్ఞానమూ, అక్షరాస్యతా అవసరం లేదు సుధా. సాటి ఆడదాన్ని ఒక వ్యక్తిలా విలువనిచ్చి గౌరవించే మనస్తత్వం కావాలి. కాస్తంత ప్రేమ కావాలి.

యింతక్రితం నువ్వన్నావు చూడు. యాదమ్మను కోర్టులో కేసు వేయమన్నానని. కేసు వేయాల్సింది ఆమె మొగుని పైననా?! లేక ఆ సంఘటనకు ప్రేరేపించిన తల్లీ, అత్తా, చెల్లి అనే ముగ్గురిపైననా? ఆడదానికి అన్యాయం జరిగిందంటే దానికి పూర్తి తప్పును మగవారిపైననే రుద్దడానికి ప్రయత్నిస్తారు. కానీ తమవైపేమైనా తప్పుందేమోనని మాత్రం పొరపాటున కూడా ఆలోచించరు.

అంటే పురుషులు స్త్రీలను అణచివేయడం లేదనా మీ ఉద్దేశం? మగవారిలో మార్పురావాల్సిన అవసరం లేదా?!

నా ఉద్దేశం పురుషాధిక్యతను సమర్థించడం కాదు. స్త్రీలు అణచివేతకు గురవుతున్నారు. పురుషులలోనూ మార్పురా వాలి. కాదనను, కానీ పురుషులకు ఆ విధంగా అవకాశాలను అందించే ప్రవర్తనను మానుకోమంటున్నాను. ఆ దిశగా స్త్రీలను జాగృతపర్చండి. అలాంటి మార్పుకు ఇష్టపడని ఆడవాళ్ళను చేతనైతే వెలివేయండి. ఒక స్త్రీ మరొకస్త్రీకి బాసటగా నిలిస్తే సాధించలేనిది ఏమీలేదు. క్రరలేకపోతే గొర్రె కూడా కరవడానికి ప్రయత్నిస్తుంది. ఐకమత్యం అనే క్రరనుపయోగించి గొర్రెను బెదిరించండి. వినకపోతే వాలుగు తగిలించండి. అంతేకానీ వాలుగు ఊరేగింపులు, రెండు సెమినార్లు చేసి సంతృప్తిపడితే ఎక్కడి గొంగళి అక్కడే వుంటుంది చెప్పకుని మరవడానికి, చూసుకుని ఏడవడానికి మాత్రమే పనికొస్తాయవి.

మీ ఆడవాళ్ళలో చైతన్యం దాగుంది. దానిని మేల్కొల్పండి.

మెదడుంది ఆలోచనుంది. పదును పెట్టండి.

ఆత్మ విశ్వాసముంది పెరిగేందుకు బాటవేయండి

కలవండి కలిసిపోరాడండి. ఐకమత్యంతో పురుషాధిక్యతను ఎదుర్కోండి. జుట్టుపట్టి కిందికి లాగండి. అంతేకాని 'నన్ను ముట్టుకోకు నామాల కాకి' అంటే మాత్రం పరిస్థితి యింకా దిగజారుతుందే తప్ప సమానత్వం అనేది కలలోని మాటగానే మిగులుతుందే తప్ప మంచిరోజులొస్తాయనుకోవడం అత్యాశే అవుతుంది అని ముగింపుకు సూచనగా ముసుగు తన్నేశారు.

అంతా విన్నాక ఆలోచించాను. బాగా ఆలోచించాను. కాదని ఎంత అనుకున్నా ఆ మాటల్లో నిజం కనిపిస్తుంది. ఆడవాళ్ళలో మార్పు అత్యవసరాన్ని నొక్కి చెబుతుంది. జిడ్డు కృష్ణమూర్తిగా రన్నట్టు ఎదుటివారి లోపాలను మనం అర్థం చేసుకోవడం సులభం. మన లోపాలను మనం తెలుసుకోవడం చాలా కష్టం. అదీ నిజమే. గురివింద గింజ సామెతలాంటి ఆడవారి స్థితి మారాల్సి వుందేమో! మొదట మమ్మల్నిమేము సంస్కరించుకుని తర్వాతే మగవారిని సంస్కరణ చేయడానికి నడుముకట్టడం సబబైన పనే అని నాకనిపించింది. కంపు వాసన మనదగ్గరే వుంటే అది మనను ముందుగా బాధిస్తుంది. దాని ప్రభావం ముందు మనపైనే కదా ఆలోచించాను.

అందరికీ తెలిసి ఎవరికీ తెలియనట్టుండే యిలాంటి సున్నిత సమస్యలపై ఆలోచనకు నాంది మా సంఘమే చేపడితే.

ఆ ఆలోచన వచ్చిన తర్వాత తృప్తనిపించింది. రేపటి నుండి నా కార్యక్రమం అదే అని గట్టిగా [illegible] కుని నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాను.